
కథ

డా॥ జొన్నలగడ్డ మార్కండేయులు

# అపశ్రుతిలో మధురస్మృతి



**రాజమణి మేష్టారు రిటైరయ్యాడు. అందులో పెద్ద ఆశ్చర్యపడవలసిన విషయం లేదు. వచ్చిన చిక్కల్లా ఆయన భార్య పేరు కూడా రాజమణి కావడం. ఆయన పెన్షను పేపర్లు వెనక్కు తిరిగొచ్చాయి. 'ఫేమిలీ పెన్షనుకు అర్హురాలైన కాలంలో భార్య పేరు రాయవలసిన చోట కూడా రాజమణి పేరే రాయబడింది. అలా పొరబాటున రాయబడిందో లేక మీ భార్య పేరు కూడా రాజమణి అయితే మీ సంబంధిత అధికారి ధ్రువీకరించి పంపిన తరువాతే మీ పెన్షను పేపర్లు పరిశీలింప బడతాయి' అని తిప్పి పంపడానికి గల కారణాలు విశదీకరిస్తూ కాగితం వచ్చింది.**

రాజమణి ఒక ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నతపాఠశాలలో బి.ఇడి. ఉపాధ్యాయుడు. నాలుగు నెలలలో రిటైరవుతాడనగా వచ్చిన పే రివిజను ప్రకారం, లాస్ట్ రిసీవ్డ్ సర్టిఫికెట్టు పే ఫిక్సేషనులో జరిగిన ఆలస్యం కారణంగా, అసలు పెన్షను ప్రపోజల్స్ పంపడమే ఆలస్యమైంది. ఇప్పుడు గోరుచుట్టు మీద రోకలి పోటులా భార్య పేరు తిరకాసు వంకతో తిరుగొచ్చిన కాగితాలు పంపడానికి ఎన్ని పాట్లు పడాలో, మళ్లీ ఎన్నాళ్లు ఎదురు చూడాలో అని రాజమణి మథనపడసాగాడు.

రాజమణికి, తండ్రి, తాతగారి పేరు పెట్టాడు. తాతగారు రాజమణి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నవ్యక్తి. తండ్రిగా ఆయన మీద గౌరవంతో, రాజమణి మేష్టారి మేనత్త కూడా, పెద్ద కూతురికి 'రాజమణి పాత్రి' అని పేరు పెట్టింది. కాని స్కూలు రికార్డులలోకెక్కేసరికి, మేనత్త కూతురు పేరులోని పాత్రి ఎగిరిపోయింది. రాజమణి మేష్టారు, పెద్దల అంగీకారంతో పాటు, తను కూడా ఇష్టపడే మేనత్త కూతురిని వివాహం చేసుకున్నాడు.

'పురాణాలలో జరత్కారువనే ముని, తన పేరు గల కన్యనే పెళ్లి చేసుకుని లోకప్రసిద్ధుడయ్యాడు. అలాగే రాజమణి పేరుతో ఒకె 'పేరు కలిగిన భార్యభర్తల జాబితాలో మంచి జంటగా లోకంలో ప్రసిద్ధి కెక్కాలని, ఈ నూతనదంపతులను దేవతలు ఆశర్వదిస్తారు' అని పెళ్లి సమయంలో ఒక కవి, పద్యరత్నాలతో రాజమణిదంపతులను ఆశీర్వదించాడు. అందుచేత అదో ఘనతగా భావించి, రాజమణి భార్య పేరులో మార్పు కోరలేదు. రిటైరయ్యే రోజులలో విచిత్రంగా మళ్లీ తమ పేర్ల ప్రస్తవన రావడం జరగడం ఏమిటో? రాజమణికి నవ్వాలో, ఏడవాలో తెలియలేదు.

కాళ్లరిగేలా మళ్లీ తిరగవలసిన ఆఫీసులన్నీ తిరిగి, ధ్రువీకరణ పత్రం కోరినట్లు రాయించి, పెన్షన్ కాగితాలు హైదరాబాద్ ఎకౌంటెంటు జనరల్ ఆఫీసుకు వెళ్లేలా చేసుకోగలిగాడు. ఏ.జి. ఆఫీసులో, హైదరాబాదులో తన భార్య కజిను సిస్టరు భర్త రామరాజు పని చేస్తున్నాడు. చుట్టపుచూపుగా కలుసుకోవడం తప్ప మరీ ఎక్కువ చనువేమీ లేకపోయినా, అవసరం కనుక ఒకసారి విషయం తెలుసుకుందామని, రాజమణి భార్యతో అన్నాడు. ఫోను చేయించాడు.

తోడల్లుడు అవుతాడు కాబట్టి రామరాజు స్వయంగా ఫోనందు కుని రాజమణితో మాట్లాడి విషయం తెలుసుకున్నాడు ఈ విషయంలో తాను అన్నీ చూసుకుంటాను అన్నాడు. ఇదివరకే చెప్పుంటే అసలు కాగితాలు వెనక్కు రాకపోనని నొచ్చుకున్నాడు. ఈ పని కోసం అయితే పనికట్టుకుని రానక్కరలేదు అన్నాడు. 'అయితే రాగలిగితే సరదాగా రండి. ఆల్రెడీ ప్రోసెస్‌లో ఉంది కాబట్టి మీ పని దగ్గరుండి చేయించి పంపేస్తాను. వదినగారిని కూడా తీసుకురండి' అని ఆహ్వానం పలికాడు.

మరదలు 'రోజా' కూడా ఆహ్వానం పలికి, వచ్చే ఫోను చేయమని చెప్పసాగింది. రాజమణి ఫోను భార్యకిచ్చాడు. రిటైరైపోయి పెన్షన్ పేపర్ల పని మీద భర్తతో కలిసి వెళ్లడం, రాజమణి భార్యకు మనస్కరించలేదు. ఏదోలా అనిపించసాగింది. అందుచేత బావ గారొక్కరే వస్తారనీ, తాను తరువాత వస్తాననీ, రాజమణి భార్య చెల్లెలు రోజాతో చాకచక్యంగా మాట్లాడింది. మొత్తానికి ఒప్పించి సరేననిపించింది.

హైదరాబాదు వెళ్లడం రాజమణికి కొత్తేమీ కాదు. అయినా రిటైరై పోయాననుకునేసరికి ముసలితనం మీద పడ్డట్లైంది. కీళ్ల నొప్పు లు, బి.పి., గుండె దడ ఉపాధ్యాయవృత్తి చివరి రోజులలో రామా వద్దన్నట్లుండేవి. హైదరాబాదు ప్రయాణం, అవసరమైతే ఏ.జీ

ఆఫీసు చుట్టూ అదీ తిరగవలసివస్తే అనుకునేసరికి, రాజమణిలో ఇప్పుడవి మళ్లీ విజృంభించాయి. ఏదో తెలియని నీరసం ఆవరించింది. రైలులో వెళదామని టిక్కెట్టుకు ప్రయత్నించాడు కాని, దొరకలేదు.

భార్య ''మన ఊరి నుంచే హైదరాబాదుకు బస్సు బయలుదేరుతోంది కూడా. మా చెల్లెలు రోజా, మరిది సనత్‌నగర్‌లోనే కదా ఉంటున్నారు! అక్కడ పోలీసు స్టేషను దగ్గర బస్సు ఆపుతున్నారు. అక్కడికి మా రోజా ఇల్లు దగ్గరే. బస్సులో వెళితే పోలీసు స్టేషను దగ్గర దిగి, శ్రమ లేకుండా వాళ్ల ఇంటికి నడిచి వెళ్లిపోవచ్చు. ఈ రోజే బయలుదేరండి. ఆలస్యం చేసుకోవడం ఎందుకు?'' అంది. భార్య చెప్పిన సలహా రాజమణికి నచ్చింది.

దురదృష్టం రాజమణికి, బస్సులో కూడా సీటు రూపంలో ప్రత్యక్షమైంది. వెనుక సీట్లు తప్ప ఖాళీ లేవు. రాజమణి తన అనారోగ్యం గోడు వెళ్లబోసుకుంటే ముందస్తు రిజర్వేషను అతను నవ్వి 'మేష్టారూ! మనూళ్లో బస్సు బయలుదేరడానికి ఇదో స్టేజీ మాత్రమే! మనకు ఎలాటు చేసిన టిక్కట్టు నంబరు సీటే ఇవ్వగలను. ఇతర స్టేజీలలో ఎవరైనా కేన్సిలేషను చేసుకుని ఉండక పోరు లెండి. బస్సు రానివ్వండి. ఒక రోజు ముందైతే మీరుకోరిన చోట బస్సులో కూర్చోపెట్టగలిగేవాడిని. ఈ రోజు చాలా మంచి రోజనుకుంటాను. పది రోజుల క్రితమే ముందు సీట్లన్నీ రిజర్వైపోయాయి. నేను ప్రయత్నించి ఎవరినైనా బతిమాలి, ముందు సీట్లో కూర్చోపెట్టడానికి ప్రయత్నించమని డ్రైవరుతో చెపుతాను' అన్నాడు.

రాత్రి ఎనిమిదింటికి బస్సు వచ్చింది. ఈ స్టేజిలో ఓ ఐదారు గురు మాత్రమే ఎక్కారు. బస్సులో జనం బాగానే ఉన్నారు. ఆఖరున ఎక్కిన రాజమణిని, ముందు సీటులో ఉన్న వ్యక్తి పరిశీలనగా చూసి ఆపి, 'నమస్కారమండి!' అన్నాడు. 'నేను మీ శిష్యుడు దానయ్యను' అన్నాడు, గుర్తుకురాన్నట్లు చూస్తున్న రాజమణితో. అయినా రాజమణికి గుర్తుకు రాలేదు. నవ్వి ప్రతినమస్కారం చేశాడు.

దానయ్య ఇప్పుడు పేరున్న బంగారం వ్యాపారి. అతనికి అమలాపురం, రావులపాలెం, రాజమండ్రిలలో బంగారం కొట్లున్నాయి. దానయ్య తండ్రి కంసాలిగా బంగారు నగలు చేయడంలో మంచి పేరుండేది. నమ్మకంతో అందరి అభిమానమూ సంపాదించి తండ్రి-దానయ్య చిన్నతనంలోనే రాజమండ్రిలో బంగారం కొట్టు తెరిచాడు. అందుచేత అప్పటికి తొమ్మిదోతరగతిలో ఉన్న దానయ్యను కొట్లో కూర్చోవడానికి, పని నేర్చుకోవడానికీ చదువు మానిపించేస్తానన్నాడు.

అప్పుడు ఏడుస్తూ దానయ్య, చదువు మానిపించవద్దని తండ్రికి చెప్పమని రాజమణి దగ్గర బావురుమన్నాడుట! అప్పుడు కులవృత్తి చాలా గొప్పదని చెప్పి, భారతంలో ధర్మవ్యాధుడనే బోయవాడి కథ రాజమణి చెప్పాడు. 'ధర్మవ్యాధుడు మాంసం అమ్మే వృత్తిని నిరసించుకోలేదు. తినేవాడికి లేని పాపం అమ్మేవాడికి ఎందుకు వస్తుందని నమ్మి, మాంసం అమ్మి తల్లిదండ్రులను పోషించాడు. అందుచేత వాడికి కౌశికుడనే బ్రాహ్మణునికి జ్ఞానబోధ చేయగల శక్తి వచ్చింది. నీ తండ్రి మంచి ఉచ్చస్థితికి చేరుకునే దిశలో వ్యాపారాన్ని అభివృద్ధిపరుస్తున్నాడు. నువ్వు పరిస్థితిని అర్థం చేసుకుని మెలకువలు తెలుసుకుని తండ్రికి సాయపడితే ధనవంతుడివి అవుతావు. చదువుకుని జీతం రాళ్ల మీద ఎంత సంపాదిస్తావు? అడపడుచుదైనా పిసరంత బంగారం, చేస్తున్న నగ నుంచి కొట్టేయకపోతే కంసాలికి కరవు వస్తుంది. ఇక మాలాంటివారి నుంచి మరీ బాగా కొట్టేయొచ్చు. ధనవంతుడివయ్యాకా మమ్మల్ని గుర్తు పెట్టుకుంటే సంతోషం కలుగుతుంది. కులవృత్తి కూడా చదువులాంటిదే!' అన్నాడు.

> రాజమణి 'పల్లీలంటే ఒకప్పుడు ఈ దేశాన్ని పాలించిన పల్లవచక్రవర్తులు. ఆవంశానికి చెందిన మా పల్లవులే పల్లీలుగా జాలర్లయ్యామని పాటలు పాడుతూ సముద్రంలోకి వలలు విసురుతూ గొప్పలు చెప్పుకుంటారు కదా! వీడు మీ వంశంలో గొప్పవాడవుతా డేమో ఎవరు చెప్పగలరు? మీకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం చేస్తుంది. మీ కొడుకులలో వీణ్ని నా దగ్గర వదిలెయ్యండి. నేను చదివిస్తాను' అన్నాడు. ఏ కళనున్నాడో గుర్నాథం విన్నాడు.

రాజమణి మనసు సంతోషంతో నిండిపోయింది. ఆగవలసిన స్టేజీలన్నింటిలోనూ ఆగి, బస్సు జనాన్ని ఎక్కించుకుని భోజనాలకని ఒక హోటలు దగ్గర ఆగింది. ఇంటి దగ్గరే రెండు చపాతీలు తిని బయలుదేరాననీ, వయసురీత్యా తానింకేమీ తిన లేననీ, అందుచేత భోజనాలకని బస్సు ఆగినపుడు దానయ్య బలవంత పెట్టినా రాజమణి బస్సులోనే ఉండిపోయాడు. బస్సు బయలుదేరింది. ఏదో సినిమా వీడియోలో వేస్తున్నాడు.

దానయ్య పెద్దగా ఆసక్తిగా చూపలేదు. కబుర్లు చెబుతూనే నిద్రలోకి జారుకున్నాడు. సినిమా మూలాన రాజమణికి నిద్ర పట్టలేదు. అది అయిపోయిన వెంటనే రాజమణి కూడా నిద్రలోకి



జారుకున్నాడు.

తెలతెలవారుతోంది. ఎవరికి కావలసిన చోట వారు బస్సు ఆపించుకుని, బస్సులోని ప్రయాణికులు దిగుతున్నారు. బస్సు సనత్‌నగర్ చేరుకుంది. దానయ్య సాయంతో పోలీసు స్టేషను దగ్గర బస్సు దిగాడు. దానయ్యది చిన్న హేండు బ్యాగు. అది చంకలో తగిలించుకున్నాడు.

రాజమణిది కూడా చిన్న బ్యాగే. వద్దన్నా వినిపించుకోకుండా,

దానయ్య, రాజమణి బ్యాగును కూడా తనే తీసుకున్నాడు. 'ఒక్క క్షణం ఇక్కడే నిలబడండి. ఇప్పుడే స్టేషనులోకి వెళ్లొస్తాను' అని జవాబుకేనా ఎదురుచూడకుండా రోడ్డు మీదున్న పోలీసు స్టేషనులోకి వెళ్ళిపోయాడు.

ఎంత ఉపాధ్యాయవృత్తిలో ఉన్నా ఎంతమందికి సంస్కారం బోధించినా రాజమణి కూడా సగటు భారతీయుడే! మన దేశంలో నేటికీ ఇంకా మలమూత్రవిసర్జన విషయంలో నిగ్రహ శక్తి తక్కువవడం వల్లో, భయం లేని అలవాటు వల్లో ఈ ప్రదేశం తానిది ఇది తానిది అని ఆలోచించే పని విద్యావంతులు కూడా చేయడం లేదు. నిద్ర లేవగానే బస్సు దిగాడేమో, ఉదయం కావడం వల్ల. రాజమణి కూడా లఘుశంక తీర్చుకోవడం కోసం చుట్టూ చూశాడు. ప్రతి రోజూ పాఠాలలో నీతులు వల్లించిన రాజమణి, ఆ సమయంలో సామాన్యమానవుడిలాగే అయిపోయి ఓ మూలగా నిలబడి లఘుశంక తీర్చుకున్నాడు.

వెనక్కు తిరిగేసరికి ఒక పోలీసు కనిపించాడు. తను చేసిన పని కొంచెం ఇంచుమించుగా పోలీసు స్టేషనుకు సమీపంగానే ఉంది. రాజమణికి సిగ్గేసింది.

కానిస్టేబులుతో అతివినయంగా. 'పెద్దవయసు ఆగలేక పోయాను...' ఏదో చెప్పబోతుంటే వినిపించుకోకుండా, 'మిమ్మల్ని మా ఇనస్పెక్టరుగారు దగ్గరుండి తీసుకురమ్మన్నారు' అన్నాడు కానిస్టేబులు.

అతని ముఖంలో ఏ భావమూ కనబడలేదు రాజమణికి. తాను దానయ్యతో కలిసివచ్చాడు కాబట్టి తనను గౌరవంగా పిలిచాడే మోనన్న ఆలోచన రాజమణిలో కలగలేదు. తను చేసినపనికి తనను మందలించడానికి పిలిచాడేమోనని కంగారు అతనిలో భయాన్ని సృష్టించింది. లోపలకు వస్తూనే, 'ఇనస్పెక్టరుగారూ! నమస్కారమండి. నా వయసు చూసి...' ఇంకా ఏదో అనబోతుంటే, దానయ్య ఆపి 'ముందు కూర్చుని ఇనస్పెక్టరు గారికేసి పరీక్షగా చూడండి' అన్నాడు.

రాజమణిలో కంగారు తగ్గింది. ఇన్స్‌పెక్టర్‌కేసి సాలోచనగా చూశాడు. వందలాదిమంది శిష్యులలో అతని ముఖం గుర్తుకు రాలేదు.

'మేస్టారూ! నన్ను గుర్తు పట్టలేదా? నేను గుర్నాథం కొడుకును' అన్నాడు.

రాజమణి గుర్నాథం పేరు విని ఇన్స్‌పెక్టర్ ముఖంలోకి పరీక్షగా చూసి 'నువ్వా... గోవిందరావువా?' అన్నాడు.

'అమ్మయ్య! గుర్తు పట్టారు' అన్నాడు సంతోషంగా.

గోవిందరావుదో విచిత్రమైన కథ. గోవిందరావు తండ్రి గుర్నాథానిది జాలరి వృత్తి. చేపలు పట్టేవాడు. ముగ్గురు ఆడపిల్లలు. ఇద్దరు కొడుకులు. సంపాదన సరిపోయేది కాదు. గోవిందరావుకు చదువు బాగా వచ్చేది. రెండవవాడికి వచ్చేది కాదు. ఒకడు చదువుకుని ఒకడు చదువుకోకపోవడం మాట ఎలా ఉన్నా, చదువుకయ్యే ఖర్చు వల్ల రెండో కొడుక్కి అన్యాయం జరుగుతుందని భయపడేది భార్య. గోవిందరావుకు చదువు చెప్పించ వద్దని పోరేది. అయినా గోవిందరావు స్కూలు మానలేదు.

గుర్నాథం భార్య గోవిందరావుని మన పల్లీల కులానికి చదువు అచ్చిరాదని చదుకోవద్దని కొట్టేది. తిండి కూడా పెట్టేది కాదు. అప్పుడు గోవిందరావు ఒక రోజు, రాజమణి ఇంటికి పారిపోయి వచ్చేశాడు. రాజమణి వాణ్ని ఓదార్చి అన్నం పెట్టి ఇంట్లోనే ఉంచుకున్నాడు. మర్నాడు గుర్నాథం, అతని భార్య కోపంగా వచ్చారు.

రాజమణి 'పల్లీలంటే ఒకప్పుడు ఈ దేశాన్ని పాలించిన పల్లవచక్రవర్తులు. ఆవంశానికి చెందిన మా పల్లవులే పల్లీలుగా జాలర్లయ్యామని పాటలు పాడుతూ సముద్రంలోకి వలలు విసురుతూ గొప్పలు చెప్పుకుంటారు కదా! వీడు మీ వంశంలో గొప్పవాడవుతా డేమో ఎవరు చెప్పగలరు? మీకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం చేస్తుంది. మీ కొడుకులలో వీణ్ని నా దగ్గర వదిలెయ్యండి. నేను చదివిస్తాను' అన్నాడు.

ఏ కళనున్నాడో గుర్నాథం విన్నాడు. చదివిస్తానని ఒప్పుకున్నాడు. గుర్నాథం భార్య మాత్రం, రాజమణిని చదువుకోవద్దని గోవిందరావుకు నచ్చచెప్పమని తెగ బతిమాలింది. తిట్టిపోసింది.

ఆ నాడు గోవిందరావు చదువుకోవడానికి కారణం రాజమణి! గోవిందరావుకు ఎన్నో సార్లు ఫీజులు కట్టడమే కాకుండా, స్కూల్లో చదువుకునే రోజులలో తండ్రితో దెబ్బలాడి అభోజనంగా వచ్చినప్పుడల్లా రాజమణి ఆదరించి అన్నం పెట్టాడు.

అదంతా గుర్తుకు తెచ్చి, గోవిందరావు, రాజమణి పాదాలకు నమస్కరించాడు. 'మేస్టారూ! నా చదువుకు సాయపడ్డారు.



ఇవాళ నాకు పోలీసు శాఖలో పెద్ద ఉద్యోగమొచ్చింది. నా తండ్రికి అన్ని విధాలా సాయపడ్డాను. తమ్ముడికి కూడా చిన్న ఉద్యోగం వేయించగలిగాను. అమ్మా, నాన్నా నా దగ్గరే ఉన్నారు. నాకు ఉన్నతస్థానాన్ని కలిగించిన మీ ఋణం తీర్చుకోలేనిది. ఈ దానయ్యగారి దయవల్ల మిమ్మల్ని చూడగలిగాను. ముందు మా ఇంట్లోకి వెళ్లాకే మీ తోడల్లుడిగారింటి వెళుదురు గాని' అన్నాడు.

రాజమణి కళ్లు చెమర్చాయి. ఒక విద్యార్థికి అవకాశముండీ కూడా చదువుకు దూరం చేశాడు. అయినా అతడు బంగారు వ్యాపారి అయ్యాడు. అందుకు నేనే కారణమంటున్నాడు. మరో విద్యార్థి ఇంట్లో ఇష్టం లేకపోయినా చదువుకుని పెద్ద ఉద్యోగి అయ్యాడు. దానికి నేనే కారణమని మురిసిపోతున్నాడు. గురువుగా తాను, లేదా తల్లిదండ్రులు చదువుకోవద్దని చెప్పడం అపశ్రుతే అయినా 'తస్మై గురవే నమః' అని శిష్యులు ఇద్దరూ భావించడం... అపశ్రుతిలో మధురస్మృతిగా రాజమణికి తెలియని ఆనందాన్ని కలిగించసాగింది. ●